క్లుప్తంగా

వడదెబ్బ నివారణకు హోమియో మందుల పంపిణీ



నందిగామరూరల్: వేసవిలో అధికంగా నమోదవుతున్న ఉష్ణోగ్రతలకు వడదెబ్బ బారిన పడకుండా ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు పాటించాలని సీఐ వైవీఎల్ నాయుడు పేర్కొన్నారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో హోమియో వైద్యుడు బొందలపాటి నరసింహారావు స్థానిక గాంధీ సెంటరులో ఏర్పాటు చేసిన వడదెబ్బ నివారణ మందుల పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వడదెబ్బ నివారణకు హోమియో మందులను ఉచితంగా పంపిణీ చేయటం అభినందనీయమన్నారు. అనంతరం సీఐను క్లబ్ సభ్యులు సత్కరించారు. లయన్స్ క్లబ్ ప్రతినిధులు అమ్మినేని జ్వాలాప్రసాద్, సీతారామయ్య, గాంధీ, మారం సత్యం, ఆర్ఎల్ నరసింహారావు, నూకేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు పట్టుబడిన వాహనాలకు వేలం

జగ్గయ్యపేట: ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు గురువారం వేలం నిర్వహిస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ గురవయ్య బుధవారం తెలిపారు. పట్టణ సమీపంలోని తొర్రకుంటపాలెం ఎక్సైజ్ స్టేషన్ వద్ద ఉదయం 10 గంటలకు పట్టుబడిన 14 వాహనాలకు వేలం నిర్వహిస్తామన్నారు. వేలంలో పాల్గొనేందుకు ఆసక్తి గల వారు రూ.2 వేలు ధరావత్తు చెల్లించి పాల్గొనాలని కోరారు.

ఉపాధి అవకాశాలు కల్పించేందుకు సీఎం కృషి



నందిగామటౌన్: భారీ పరిశ్రమలు తీసుకు వచ్చి నియోజకవర్గంలోని యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రంగా కృషి చేస్తున్నారని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ పేర్కొన్నారు. పట్టణ సమీపంలోని ఆర్ఎస్ గార్డెన్స్‌లో మంగళవారం రాత్రి నియోజకవర్గ మినీ మహానాడు నిర్వహించారు. ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. నదుల అనుసంధానం చేసిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కిందన్నారు. లోకేష్‌ను ఉన్నత పదవిలో చూడాలని టీడీపీ శ్రేణులు ఆశపడుతున్నారని చెప్పారు. మాజీ మంత్రి నెట్టెం రఘురాం, నాయకులు బోస్, కోట వీరబాబు, మండవ కృష్ణకుమారి, కోగంటి బాబు పాల్గొన్నారు.

ఘనంగా హనుమాన్ జయంతి మహోత్సవాలు

నందిగామరూరల్: మండలంలోని పల్లగిరి గట్టుపై వేం చేసి ఉన్న అభయ వీరాంజనేయ స్వామివారి ఆలయంలో హనుమాన్ జయంతి మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఆలయ అర్చకులు స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు, అభిషేకాలు చేశారు. ముందుగా సుప్రభాత సేవతో పాటు సామూహిక హనుమాన్ చాలీసా పారాయణ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. గురువారం హనుమత్ జయంతి సందర్భంగా స్వామివారికి అష్టోత్తర శత కలశాభిషేకం, బాలబోగ వినియోగం, లక్ష మల్లెలార్చన, గోపూజ, పలవు రకాల హోమాది క్రతువులు జరుగుతాయని ఆలయ కమిటీ చైర్మన్ పబ్బతి నరసింహారావు తెలిపారు. అనంతరం భారీ అన్నప్రసాద వితరణ జరుగుతుందన్నారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వేసవి విజ్ఞాన తరగతులు



కొణకంచి(పెనుగంచిప్రోలు): స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు కొనసాగుతున్నాయి. విద్యార్థులతో బుధవారం పుస్తక పఠనం చేయించటంతో పాటు పాటలు పాడించి, ఆటలు ఆడించారు. శిక్షణ తరగతులకు విద్యార్థులు ఉత్సాహంగా హాజరవుతున్నారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి అల్లూరు రామచంద్రుడు, పాఠకులు పాల్గొన్నారు.

జగ్గయ్యపేటఅర్బన్: పట్టణంలోని జిల్లా గ్రేడ్-1 స్థాయి గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం ఉత్సాహంగా కొనసాగుతోంది. ఈ సందర్భంగా బుధవారం విద్యార్థులచే పుస్తక పఠనంలో భాగంగా దేశ నాయకుల కథలు, జనరల్ నాలెడ్జ్ పుస్తకాలు చదివించారు. అనంతరం ఇంగ్లిష్ ఉపాధ్యాయుడు వినోద్‌బాబు విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లిష్ నేర్పించారు. చివరిగా విద్యార్థులకు ఆటవిడుపుగా ఖోఖో ఆట ఆడించారు. గ్రంథాలయాధికారి ఎ.ప్రభ, సిబ్బంది శ్యామల, రమేష్, రాము, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

ఉద్యోగుల్లో బదిలీల ఫీవర్!

- అనువైన అధికారుల కోసం కూటమి నాయకుల ప్రయత్నాలు
- ఆందోళనలో ఉద్యోగులు



జగ్గయ్యపేట తహసీల్దార్ కార్యాలయం

జగ్గయ్యపేట: నియోజకవర్గంలో వివిధ ప్రభుత్వ శాఖాధికారుల్లో బదిలీల ఫీవర్ పట్టుకొంది. జూన్ 5వ తేదీతో ఉద్యోగుల బదిలీల ప్రక్రియ ముగుస్తుండటంతో ఎక్కడకు బదిలీ అవుతారోనని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే ప్రభుత్వం బదిలీలు జరపాలని ఆదేశాలు జారీ చేసింది. దీంతో బదిలీలకు సంబంధించి ఆయా శాఖల అధికారులు ఉద్యోగుల జాబితాను కూడా సిద్ధం చేసుకొన్నారు. ముఖ్యంగా రెవెన్యూ, పోలీస్, పంచాయతీ రాజ్, వైద్యారోగ్య, ఆర్అండ్‌బీ, ఇరిగేషన్ శాఖల అధికారుల బదిలీలు జరిగే అవకాశం ఉంది. అయితే తమకు అనుకూలమైన అధికారులను ఆయా మండలాల్లో నియమించుకుని ఇష్టం లేని వారిని సాగనంపేందుకు అధికార పార్టీ నాయకులు జాబితాలు సిద్ధం చేసినట్లు సమాచారం. అంతే కాకుండా వచ్చే ఏడాది స్థానిక సంస్థల ఎన్నికలు రానుండటంతో తమకు అనుకూలమైన అధికారులను బదిలీలు లేకుండా స్థానికంగా కొనసాగించేందుకు నియోజకవర్గ ప్రజా ప్రతినిధి జిల్లా అధికారులకు జాబితాను అందించినట్లు తెలుస్తోంది.

ప్రభుత్వం నుంచి రాని విధి విధానాలు..

బదిలీలపై స్పష్టమైన విధి విధానాలు ఆయా శాఖల వారీగా కార్యాలయాలకు రాకపోవటంతో ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. అయితే అన్ని శాఖల అధికారులు వారి సర్వీస్ జాబితా, ఎంత కాలంగా పని చేస్తున్నారనే విషయాలను ఆన్‌లైన్‌లో సిద్ధం చేసుకొంటున్నారు. ఐదేళ్ల ఒకే ప్రాంతంలో పని చేస్తున్న ఉద్యోగులు తప్పనిసరిగా బదిలీ కోసం దరఖాస్తు చేసుకోవాలి. అయితే జూన్‌లో శాఖల వారీగా కౌన్సెలింగ్ నిర్వహించి బదిలీల ప్రక్రియను చేపట్టవచ్చని సమాచారం.

అనుకూలమైన వారిని ఉంచేందుకు ప్రయత్నాలు..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తుండటంతో తమకు అనుకూలంగా ఉన్న వారిని బదిలీ కాకుండా ఇక్కడే ఉంచేందుకు నాయకులు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ముఖ్యంగా పోలీస్ శాఖపై దృష్టి సారించారు. అయితే నియోజకవర్గంలో పోలీస్, రెవెన్యూ, పంచాయతీ రాజ్ అధికారులు వచ్చి ఏడాదవుతున్నప్పటికీ అధికార పార్టీ నాయకుల మాట వినని అధికారులను బదిలీ చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. అదే బాటలో పెనుగంచిప్రోలు, వత్సవాయి మండలాలకు చెందిన ఎంపీడీవో, తహసీల్దార్ల మార్పులు జరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇరిగేషన్, మహిళా శిశు సంక్షేమ శాఖ, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్, హౌసింగ్ శాఖాధికారులను బదిలీ చేసేందుకు కూటమి నాయకులు సిద్ధం చేస్తున్నారు.

ఆందోళనలో సచివాలయ సిబ్బంది..

గత ప్రభుత్వ హయాంలో ఏర్పడిన సచివాయ వ్యవస్థలో పని చేస్తున్న సిబ్బందిని సైతం ఆయా గ్రామాల కూటమి నాయకులు వారిని వెళ్లిపోవాలంటుండటంతో ఆందోళన చెందుతున్నారు. కంచికచర్ల, విజయవాడ ప్రాంతాల నుంచి సిబ్బందిని తీసుకువస్తామని ఆయా గ్రామాల నాయకులు బహిరంగంగా చెబుతుండటం చర్చనీయాంశంగా మారుతుంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం బదిలీలు చేయాలి, కానీ కూటమి నాయకులు ఇష్టారాజ్యంగా బదిలీలు చేయటమేంటని పలువురు ఉద్యోగులు పెదవి విరుస్తున్నారు.

యోగాతో మానసిక, శారీరక ఆరోగ్యం



కంచికచర్ల ఎక్సైజ్‌శాఖ కార్యాలయంలో యోగాసనాలు చేస్తున్న అధికారులు

నందిగామటౌన్: యోగా సాధనతో శారీరక, మానసిక ఆరోగ్యానికి మేలు జరుగుతుందని ఆర్డీవో బాలకృష్ణ పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో పలు శాఖల అధికారులతో కలిసి బుధవారం ఆయన యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ.. యోగాసాధనతో ఎన్నో ప్రయోజనాలున్నాయన్నారు. ముఖ్యంగా మానసిక ప్రశాంతత, శారీరక, మానసిక ఆరోగ్యానికి ఎంతో దోహదపడుతుందన్నారు. యోగా సాధన వల్ల కలిగే ప్రయోజనాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన కలిగించాల్సిన బాధ్యత అధికారులు, సిబ్బందిపై ఉందని చెప్పారు. 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈ నెల 21 నుంచి జూన్ 21వ తేదీ వరకు యోగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రమణబాబు, తహసీల్దార్ సురేష్‌బాబు, పలు శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

యోగాతో ఒత్తిడి, ఆందోళన దూరం..

నందిగామరూరల్: యోగా సాధన చేయటం వల్ల ఒత్తిడి, ఆందోళన తగ్గటంతో పాటు మానసిక ప్రశాంతత కలుగుతుందని సర్పంచ్ చెరుకూరు హైమారావు పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా మండలంలోని తొర్రగుడిపాడు గ్రామ పంచాయతీ కార్యాలయంలో బుధవారం యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా సాధన ప్రతి ఒక్కరి దినచర్యలో భాగం చేసుకోవాలన్నారు. యోగా సాధనతో రోగ నిరోధక శక్తి పెరగటంతో పాటు జీర్ణక్రియ మెరుగుపడుతుందని తెలిపారు. గ్రామ పరిధిలో తమ వంతుగా యోగా సాధనపై ప్రజలకు అవగాహన కలిగించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కార్యదర్శి మహమ్మద్ ఖాశీం, చిన్నారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

యోగాసనాలతో సంపూర్ణ ఆరోగ్యం..

పెనుగంచిప్రోలు: యోగాసనాలతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని సర్పంచ్ వేల్పుల పద్మకుమారి అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం స్థానిక గ్రామ సచివాలయ ఆవరణలో పంచాయతీ కార్మికులతో యోగాసనాలు వేయించారు. ఈసందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. యోగాతో శారీరక, మానసిక దృఢత్వం కలుగుతుందన్నారు. ఒత్తిడి తగ్గటంతో పాటు నిద్ర మెరుగవుతుందన్నారు. ధ్యానం, శ్వాస మీద ధ్యాస లాంటి వాటి వల్ల మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. ప్రస్తుత సమాజంలో యోగా ప్రతి ఒక్కరి జీవితంలో భాగం కావాలని చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కె.శ్యామ్, న్యాయవాది వేల్పుల స్వర్ణపద్మతేజ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంగా ఉండేందుకు ఆసనాలు తప్పనిసరి

కంచికచర్ల: ప్రతి ఒక్కరూ యోగాసనాలు చేయటం వల్ల రోగాలు దరిచేరకుండా ఆరోగ్యంగా ఉంటారని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ సీఐ షేక్ అష్రఫున్నీసా బేగం అన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా స్థానిక ఎక్సైజ్ శాఖ కార్యాలయ ఆవరణలో బుధవారం యోగాసనాలు వేశారు. ఈ మేరకు సీఐ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ దినచర్యలో భాగంగా ఆసనాలు చేయాలన్నారు. యోగాసనాలు జీవితంలో ఒక భాగమని, ఆరోగ్యంగా ఉండేందుకు ప్రతి ఒక్కరూ రోజుకు ఒక గంట ఆసనాలు, ఉదయం, సాయంత్రం వేళల్లో వాకింగ్, వ్యాయామం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ గాలీబ్‌సాహెబ్, సిబ్బంది పాల్గొన్నారు.

రెవెన్యూ కార్యాలయంలో..

స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఇన్‌చార్జి తహసీల్దార్ వేమూరి మానస ఆధ్వర్యంలో యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా యోగాసనాలు చేశారు. ఈనెల 21 నుంచి జూన్ 21వ తేదీ వరకు ప్రభుత్వం యోగాంధ్ర కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అందులో భాగంగా ప్రతి ఒక్కరూ ఆసనాలు చేయాలని చెప్పారు. ఆర్ఐ వెంకటరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

ఒత్తిడి నివారణకు యోగా దోహదం

వీరులపాడు: శారీరక, మానసిక, ఆరోగ్య రక్షణకు, ఒత్తిడి నివారణకు యోగా ఎంతో ఉపయోగపడుతుందని తహసీల్దార్ హుస్సేన్ పేర్కొన్నారు. మండలంలోని జుజ్జూరు గ్రామంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఆయా శాఖల అధికారులు, సిబ్బందితో బుధవారం యోగాసనాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగాను రోజు వారీ జీవన విధానంలో భాగంగా చేసుకోవాలన్నారు. క్రమం తప్పకుండా యోగా చేయటం వలన రోగాల బారి నుంచి తప్పించుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజు, డెప్యూటీ తహసీల్దార్ నాగరాజు, పలువురు అధికారులు, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

యోగాంధ్ర మాసోత్సవాలను విజయవంతం చేయాలి..



చిల్లకల్లులో యోగా చేస్తున్న ఎంపీడీవో నితిన్ తదితరులు

చిల్లకల్లు(జగ్గయ్యపేట): జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఈ నెల 21 నుంచి యోగాంధ్ర మాసోత్సవాలు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించిందని ఎంపీడీవో నితిన్ తెలిపారు. స్థానిక సచివాలయంలో ఉదయం అధికారులు, సిబ్బందితో కలిసి యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలోని అన్ని సచివాలయాలలో ఉదయం సమయంలో యోగా నిర్వహించాలన్నారు. అదే విధంగా యోగాకు సంబంధించిన పాటలు, చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలను విద్యా సంస్థల్లో నిర్వహించాలని తెలిపారు. యోగాంధ్ర మాసోత్సవాలను విజయవంతం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏవో మాధవ శర్మ, సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



నందిగామలో యోగాసనాలు వేస్తున్న ఆర్డీవో బాలకృష్ణ, మున్సిపల్ కమిషనర్ రమణబాబు



యోగాసనాలు చేస్తున్న సర్పంచ్ పద్మకుమారి, పంచాయతీ కార్మికులు



తొర్రగుడిపాడులో యోగా సాధన చేస్తున్న సర్పంచ్, గ్రామస్తులు



జుజ్జూరులో యోగాసనాలు చేస్తున్న అధికారులు

నేడు హనుమత్ జయంతి



వేడుకల బ్యానర్ ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

కంచికచర్ల: హనుమంత్ జయంతి సందర్భంగా స్థానిక రామాలయంలో గురువారం ప్రత్యేక పూజలు జరుగుతాయని అర్చకులు తారంబాబు బుధవారం తెలిపారు. హనుమాన్ చాలీసా పారాయణం, తమలపాకులతో స్వామివారిని అలంకారం చేసి విశేష పూజలు నిర్వహిస్తామన్నారు. అదేవిధంగా మండలంలోని పరిటాల సమీపంలో జాతీయ రహదారి పక్కన వేం చేసి ఉన్న ప్రసన్నాంజనేయ స్వామి విగ్రహం వద్ద భక్తులు ప్రత్యేక పూజలు చేయనున్నారు.

జయంతి గ్రామంలో బ్యానర్ ఆవిష్కరణ

కంచికచర్ల: వీరులపాడు మండలం జయంతి గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో తిరుమల, తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో గురువారం హనుమత్ జయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. బుధవారం ఆలయం వద్ద హనుమత్ జయంతి వేడుకల బ్యానర్‌ను ఆవిష్కరించారు. ఆలయం వద్ద ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు చేసి హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహిస్తామన్నారు.

బోడవాడలో ఇసుక డంప్ సీజ్..

వీరులపాడు: ఇసుక అక్రమ రవాణాకు పాల్పడినా, గ్రామాల్లోని నిర్మానుష్య ప్రాంతాల్లో నిల్వ చేసినా చర్యలు తప్పవని డెప్యూటీ తహసీల్దార్ నాగరాజు హెచ్చరించారు. మండలంలోని బోడవాడ గ్రామంలో నిల్వ చేసిన ఇసుక డంప్‌ను బుధవారం ఆయన సీజ్ చేశారు. ఈ సందర్భంగా డీటీ మాట్లాడుతూ.. గుర్తు తెలియని వ్యక్తులు గ్రామంలో ఇసుక నిల్వ చేశారనే సమాచారం రావటంతో పరిశీలించి ఇసుకను సీజ్ చేసి స్వాధీనం చేసుకున్నామన్నారు. సుమారు 30 ట్రక్కుల మేర ఇసుక ఉంటుందని తహసీల్దార్ కార్యాలయానికి తరలిస్తామని తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. వీఆర్వో శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

చందర్లపాడులో ర్యాలీ

చందర్లపాడు(నందిగామరూరల్): బ్రిటీష్ కాలం నుంచి పోరాడి సాధించుకున్న హక్కులు, చట్టాలను సైతం కాలరేసేలా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కోట కల్యాణ్ పేర్కొన్నారు. లేబర్ కోడ్‌ను రద్దు చేయాలని జూలై 9వ తేదీన చేపడుతున్న దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ ఆశా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం చందర్లపాడులో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో సీఐటీయూ చందర్లపాడు మండల కార్యదర్శి వేల్పుల ఏసోబు, నాయకులు ఈదర కమల, వేల్పుల రాణి, కస్తాల మేరి, భారతి, ఈశ్వరమ్మ, మల్లేశ్వరి, పెద్ద సంఖ్యలో ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

నందిగామ, జగ్గయ్యపేటల్లో భారీ వర్షం



మల్కాపురంలో పిడుగుపాటుకు మృతి చెందిన గొర్రెలు

నందిగామరూరల్/జగ్గయ్యపేట/జగ్గయ్యపేటఅర్బన్: నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల్లోని అన్ని గ్రామాల్లో బుధవారం భారీ వర్షం కురిసింది. ఉదయం సమయంలో ఆకాశం ఒక్కసారిగా మేఘావృతమై ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. దీంతో రెండు నియోజకవర్గాల్లో జనజీవనం స్తంభించింది. మండలంలోని మల్కాపురం గ్రామంలో పిడుగుపాటుకు పంట పొలాల్లో ఉన్న రెండు గొర్రెలు మృతి చెందాయి. వేదాద్రి గ్రామంలోని యోగానంద లక్ష్మీ నరసింహ స్వామి వారి ఆలయ ఆవరణలో కల్యాణోత్సవాలకు ఏర్పాటు చేసిన చలువ పందిరి ఈదురు గాలులకు కుప్పకూలింది. భక్తులు ఎవరూ లేకపోవటంతో పెనుప్రమాదం తప్పింది. పట్టణంలోని జామియా పెద్ద మసీదుపై పిడుగు పడటంతో రెండు మినార్‌లలో ఒక మినార్ పై భాగం స్వల్పంగా దెబ్బతింది. మినార్‌పై శిఖరంపై ఉన్న చంద్రవంకపై పిడుగు పడటంతో మినార్ పై భాగం బీటలు వారింది. భారీ శబ్దం రావడంతో మసీదు కాంప్లెక్స్‌లో ప్రజలు ఉలిక్కిపడ్డారు. కొంతకాలంగా ఉక్కపోతతో అల్లాడిన ప్రజలు కురిసిన వర్షంతో సేద తీరారు. కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యం, మొక్కజొన్న రైతులు పట్టాలు కప్పి పంటను కాపాడుకునే యత్నం చేశారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది.

భూ రీసర్వేను వేగవంతం చేయాలి

గంద్రాయి(జగ్గయ్యపేట): గ్రామాల్లో చేపడుతున్న భూరీసర్వేలను వేగవంతం చేయాలని నందిగామ ఆర్డీవో బాలకృష్ణ పేర్కొన్నారు. గ్రామంలో జరుగుతున్న రీసర్వేను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలో భూ రీసర్వే మందకొడిగా సాగుతుందన్నారు. సర్వేయర్లు పూర్తి బాధ్యత తీసుకుని వేగవంతం చేయాలని తెలిపారు. ముఖ్యంగా గ్రామాల్లో సర్వేకు సంబంధించి ఫిర్యాదులు వస్తే తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కలెక్టర్ నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో రీసర్వే సమస్యలపై ఫిర్యాదులు వచ్చాయని, వాటిని పరిష్కరించాలని చెప్పారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ అనూష్‌బాబు, వీఆర్వోలు, సర్వేయర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా హనుమాన్ శోభాయాత్ర



శోభాయాత్రలో పాల్గొన్న ప్రజలు

నందిగామటౌన్: హనుమత్ జయంతి సందర్భంగా పట్టణంలో బుధవారం రాత్రి హనుమాన్ శోభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. యువత, హిందూ ఐక్య సంఘాలు పెద్ద సంఖ్యలో పాల్గొని కాషాయ జెండాలతో ముక్కోటి మహా మండపం వద్ద నుంచి పట్టణంలోని ప్రధాన వీధుల్లో జైశ్రీరామ్ నినాదాలతో హనుమాన్ శోభాయాత్ర ర్యాలీ చేశారు. ఏటా వైశాఖ మాసంలో హనుమత్ జయంతి సందర్భంగా హిందూ ఐక్య సంఘాల ఆధ్వర్యంలో శోభాయాత్ర నిర్వహించటం ఆనవాయితీగా వస్తోందని ఐక్య సంఘాల ప్రతినిధులు చెప్పారు. పెద్ద సంఖ్యలో యువకులు, హిందూ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

కల్యాణ మండప నిర్మాణానికి ఐరన్ అందజేత



గండేపల్లిలో ఐరన్ అందజేస్తున్న సెంటినీ హెచ్ఆర్ మేనేజర్ శ్రీనివాసరావు, సర్పంచ్ రవి

గండేపల్లి(కంచికచర్ల): కల్యాణ మండపం నిర్మాణానికి సహాయ సహకారాలు అందజేసేందుకు దాతలు ముందుకురావటం అభినందనీయమని సర్పంచ్ బొక్కా రవికుమార్ పేర్కొన్నారు. మండలంలోని గండేపల్లి సీఎస్ఐ చర్చి ప్రాంగణంలో కల్యాణ మండప నిర్మాణానికి సెంటినీ బయో ప్రొడక్ట్ కర్మాగార యాజమాన్యం బుధవారం రూ.2.7 లక్షల విలువైన 5 టన్నుల ఐరన్‌ను అందజేసింది. సర్పంచ్ మాట్లాడుతూ.. సెంటినీ కర్మాగార యాజమాన్యం గ్రామాభివృద్ధికి ఎంతగానో సహకరిస్తోందన్నారు. ఇటీవల సీఎస్ఐ చర్చి నిర్మాణానికి రూ.65 లక్షల విలువైన ఐరన్‌ను అందజేసిందన్నారు. అదేవిధంగా గ్రామంలో ఉచితంగా ఆరోగ్య శిబిరాలు నిర్వహించి పేదలకు వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు కూడా ఉచితంగా ఇస్తున్నారని చెప్పారు. అంతేకాకుండా ఎత్తిపోతల పథకం మరమ్మతుకు సొంత నిధులు వెచ్చించి రైతులకు సాగునీరు అందించారని గుర్తు చేశారు. గ్రామంలో ఎల్ఈడీ వీధిలైట్లు వేయించడంతో పాటు తాగునీటి సరఫరా చేసేందుకు వారి వంతుగా కృషి చేస్తున్న కంపెనీ చైర్మన్ త్రిపురనేని శేషగిరిరావుకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కంపెనీ హెచ్ఆర్, పర్సనల్ మేనేజర్ ఎం.శ్రీనివాసరావు, సివిల్ మేనేజర్ టి.శ్రీనివాసరావు, హెచ్ఆర్ డీజీఎం రాహుల్, సంఘ కమిటీ సభ్యులు మార్కపూడి మధుబాబు, శ్రీరాం మల్లికార్జునరావు, బొక్కా ప్రభాకరరావు, రాబర్ట్, బొక్కా రమేష్, చాట్ల స్వామి, బొక్కా రత్నం తదితరులు పాల్గొన్నారు.

ఆలయ యజ్ఞశాల పనుల ప్రారంభం



జగ్గయ్యపేటఅర్బన్: పట్టణంలోని శ్రీధనశైల సీతారామస్వామి దేవస్థానం(పెద్ద రామాలయం) పునఃనిర్మాణం పూర్తయినందున ఈనెల 30 నుంచి జూన్ 2వ తేదీ వరకు జరుగు ఆలయ ప్రతిష్ఠా మహోత్సవాల్లో భాగంగా బుధవారం యజ్ఞశాల(యాగశాల)నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ కార్యక్రమంలో పాల్గొని యజ్ఞశాల నిర్మాణ పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ ప్రతిష్ఠా మహోత్సవం కమిటీ ప్రతినిధులు వాసిరెడ్డి బెనర్జీ, కర్రి శేషగిరిరావు, మన్నె నారాయణరావు, పేరూరి కోటేశ్వరరావు, కామినేని కిశోర్, దుప్పలపూడి రాంప్రసాద్, దేవరశెట్టి ప్రసాద్ పాల్గొన్నారు.

వ్యాపారవేత్త పర్వతనేని కుమార్ మృతి



జగ్గయ్యపేటఅర్బన్: ప్రముఖ వ్యాపారవేత్త, పీఎస్ఆర్ బస్ ట్రావెల్స్ అధినేత పర్వతనేని వెంకట రత్నకుమార్(కుమార్)(62) గుండెపోటుతో మృతిచెందారు. ఆయన ఆకస్మిక మృతి పట్ల పలువురు నాయకులు బుధవారం సంతాపం వ్యక్తం చేశారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు వారి నివాసానికి వెళ్లి కుమార్ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

కుమార్ భౌతిక కాయానికి ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య), టీడీపీ జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురాం, మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభాను, ఆయన సతీమణి సామినేని విమలాభాను కుమార్ భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు వట్టెం మనోహర్, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ హఫీజున్నీసా ఫిరోజ్, పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి కన్నమాల శామ్యూల్, పట్టణ ప్రధాన కార్యదర్శి పింగళి నర్సింహారెడ్డి, ఉపాధ్యక్షుడు దివ్వెల రామారావు, పట్టణ కార్మిక విభాగం అధ్యక్షుడు గంగోలు వినోద్, ప్రచార విభాగం అధ్యక్షుడు గోగుల వెంకయ్య, ఏఎంసీ మాజీ డైరెక్టర్ మన్నె అప్పారావు ఉన్నారు.